# ది ట్రిక్

వి.పి.బి.నాయర్

స్పెషల్ ఐ.జి.ఆఫ్ పోలీస్

"రామయ్యా! ట్రెయినేమైనా లేటుండే మో కనుక్కున్నావా?" ప్రశ్నించాడు డియ్యస్పీ నాగభూషణం. "కరెక్ట్ టయానికే బాబూ! పన్నెండింటికల్లా వచ్చేస్తదంట" వినయంగా చెప్పాడు రామయ్య. టైమ్ చూసుకున్నాడు డియస్పీ — ఇంకా మూడు గంటల టైముంది.

"చూడు రామయ్యా! వచ్చేవాళ్ళు చాలా ముఖ్యమైన అతిథులు— మన ఆంధ్రా వంటకాలుఅంటే ఇష్టం"

"చిత్తం — చిత్తం — నావన్నీ సరిగా చూసుకున్నా బాబూ! గోంగూర, ఆవకాయ, అప్పడాలు, వడియాలు, గెడ్డపెరుగూ అన్నీ ప్రత్యేకంగా చేయిస్తున్నా! కోడికూర, మటన్ రోస్టూ, బొమ్మిడాల కూర మన నాయుడు హోటల్లో జాగర్తగా చెయ్యమనీ మరీ మరీ చెప్పాను"

"ఆల్ రైట్! మరి ఓసారి గెస్ట్ హావుస్ కెళ్ళి చూసిరా — రూమ్ నీట్‌గా వుండాలి! కొత్త సబ్బులు, తువ్వాళ్లూ పెట్టమని చెప్పు — బెడ్ షీట్స్ కూడా కొత్తవే వుండాలని వేసె ప్పావని చెప్పు. ఫ్రిజ్‌లో ఫిల్టర్ వాటర్ పెట్టించు. తాళం చెవి తీసుకుని ఓ మనిషిని ప్రత్యేకంగా అక్కడుంచు — అర్థమైందా?" — అడిగాడు డియస్పీ.

"సిత్తం బాబూ"

"ఇంకా ఆలానే నిలబడతావేం! గెస్ట్ హావుస్‌కు జీప్‌లో వెళ్ళి రా!" అన్నాడు డియస్పీ. రామయ్య పరుగు లాంటి నడకతో జీప్ వద్దకు వెళ్లాడు.

"ఒరేయ్ భీమయ్యా!" — అరిచాడు డియస్పీ.

చాటున బీడీ దమ్ము కొడుతున్న భీమయ్య "పిలిచారా బాబూ!" అంటూ నెమ్మదిగా వచ్చాడు.

"కాదు. గుండెలలిసేలా అరిచాను. ఇంతకీ కారొచ్చిందా?"

"వచ్చేసింది బాబూ"

"మరి చెప్పవేం — వెళ్లి డ్రయివర్నిలా పిలుచుకురా!" మరు క్షణంలో భీమయ్య డ్రయివర్ని తీసుకొచ్చాడు.

"బండి కండిషన్ బావుందా?"

"బ్రహ్మాండంగా వుంది సర్"

"కార్లో ఏసీ పనిచేస్తూందా?"

"చేస్తూంది సర్!"

"పెట్రోల్ పోయించావా?"

"ట్యాంక్ ఫుల్ చేయించి మరీ పట్టుకొచ్చానుసర్!"

"అయితే పదకొండున్నరకల్లా స్టేషన్‌కెడదాం. టిఫిన్ చేసి రెడీగా వుండు"— అన్నాడు డియస్పీ. డ్రయివర్ నిష్క్రమించాడు.

డియస్పీ నాగభూషణం సంతృప్తిగా తలపంకించాడు. మరి వచ్చే అతిథులు మామూలు వాళ్లేంకాదు. తనఒక్కగానొక్క కూతుర్ని చూడ్డానికొస్తున్నారాయె. 'ఈ సంబంధం ఖాయమైతే చాలు!' మనసులోనే ఏడుకొండల వాణ్ణి ప్రార్థించాడు నాగభూషణం.

ఇంతలో గెస్ట్ హావుస్‌కని బయల్దేరిన రామయ్య, ముఖాన్ని తోటకూర కాడలా వేలాడేసుకొని గదిలోకి ప్రవేశించడంతో నాగభూషణం గుండె గుభేల్మంది.

"ఏమైంది రామయ్యా?"— ఆందోళన నిండిన స్వరంతో ప్రశ్నించాడు నాగభూషణం.

"మనూరి యమ్మెల్లే మీసాల పోతురాజుగారు గెస్ట్ హావుస్ తీసేసుకున్నారండీ — ఎంతజెప్పినా వాళ్ల మదుసులు ఇనడం లేదు బాబయ్యా!"— చల్లగా చెప్పాడు రామయ్య ఏడుపు ముఖం పెట్టి.

నాగభూషణం ముఖం మాడిపోయింది.

"యమ్మెల్లే గారిల్లు ఇక్కడే గదరా! ఆయనకు గెస్ట హావుస్‌లో పనేంటిరా?"

"తెల్దండి బాబూ!"

"సరే! ఓసారి గెస్ట్ హావుస్‌కు ఫోన్ కలుపు"


రామయ్యఫోన్ కలిపాడు. యమ్మెల్యే మీసాల పోతురాజు గారి అనుంగు శిష్యుడు చెంచారావు లైన్లోకొచ్చాడు. డియస్పీ నాగభూషణం సాధ్యమైనంత సౌమ్యాన్ని కంఠంలో పలికిస్తూ "హలోవ్! చెంచారావు గారూ! బావున్నారా?"— అన్నాడు. చెమ్చారావ్ క్రిందబడిన స్టీలు చెంచాలా శబ్దం చేస్తూ గలగలనవ్వాడు.

"మొన్న కోడిపాలెం మర్డర్ కేసులో యమ్మెల్లే గారు వదిలి పెట్టమన్నా మీరేం పట్టించుకోలేదు మరి"— అదోలా ...విషపు నవ్వు నవ్వాడు.

'అమ్మ దొంగగాడిదా — ఏం లింకె

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

ఆంధ్రజ్యోతి వారపత్రిక 3-1-92



ట్టేశావ్‌రా!''— మనసులోనే ఆశ్చర్య పోయాడు డియస్పీ.

''యమ్మెల్లే గారున్నారా?''

''గదిలో నిద్దరోతున్నారు — ఎవురొ 'చ్చినా లేపొద్దన్నారు'' డియస్పీకి అర్థమై పోయింది. తాను రూమ్ కావాలంటే యమ్మెల్లే వచ్చినా ఇవ్వడు సరిగదా — కొత్త ప్రాబ్లెమ్ కూడా సృష్టిస్తాడు. ఫోన్ పెట్టేసిన డియ్యస్పీ బుర్రలో విచిత్రమైన ఆలోచన మెదిలింది.

'వచ్చే అతిథులు అతిముఖ్యమైన వాళ్ళు. వాళ్లను గెస్ట్ హవుస్‌లో ఎలా గైనా ఎకామిడేట్ చేయాలి. చేసి తీరాలి' — మనసులోనే అనుకున్నాడు డియస్పీ నాగభూషణం.

''రామయ్యా! యమ్మెల్లే గారింటికి ఫోన్ చేసి, అమ్మగారితో నేను మాట్లా డతానని చెప్పు'' నవ్వుతూ అన్నాడు.

ఓ నిమిషం తరువాత యమ్మెల్లేగారి భార్య గజ పర్వతవర్ధని లైన్లోకొచ్చింది.

''నమస్కారమండీ — అన్నయ్య గారూ''— పలకరించింది పర్వతవర్ధని.

''ఆ — నమస్కారమమ్మా — మీ ఆరోగ్యమెలా వుంది?''

''బాగానే వుందండీ అన్నయ్య గారూ''

''మీ వారి ఆరోగ్యమెలా వుందమ్మా?''

''ఆయనకేం అన్నయ్య గారూ! నిక్షేపంలా వున్నారు. ఇంటి సంగతి పట్టించుకోడానికి తీరిక దొరకదు గానీ — ఊళ్ళో సంగతులన్నింటికీ తగుదునమ్మా అంటూ తిరుగుతుం టాడాయన''

''బాగా చెప్పావమ్మా — నీలాంటి దొడ్డ యిల్లాలు ఇంట్లో వుండగా ఆయ నకా గెస్ట్ హవుస్‌లో ఏంపనమ్మా''

''అయ్యో... అయ్యో... వీడి జిమ్మడ —గెస్ట్ హవుస్‌లో మకాం పెట్టడా మా ఆయన''— ఫోన్లోనే ఘొల్లుమన్నదా దొడ్డ ఇల్లాలు.

''జాగ్రత్తపడు తల్లీ — ఇంటి భోజనం మాని హోటల్లో తింటే వొళ్ళు గుల్లవుతుందమ్మా — నువ్ పేపరు చూస్తావా తల్లీ''

''చూస్తానన్నయ్య గారూ!''

''ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా వుండాలి. ఈ మధ్య ఎయిడ్స్ అనే భయంకరమైన అంటు వ్యాధి వ్యాపించింది. ఈ మధ్యే హైదరాబా లో ఒకడు చచ్చాడు. ఆ ఎయిడ్స్ ఎంత భయంకరమైన అంటు వ్యాధో తెలుసా తల్లీ — ఆ శవాన్ని తాకడానికి సైతం భయపడి అంతా పారిపోయా రంటమ్మా!''

''అన్నయ్యగారో — నాకెందుకో భయమేస్తోంది''

''ఇలాంటప్పుడే గుండె ధైర్యం కావాలి తల్లీ — భయపడితే ఎలా గమ్మా! అసలా ఎయిడ్స్...''

''ఇంకేం చెప్పకండి అన్నయ్య గారూ! నేనిప్పుడే ఆయన్ని ఇంటికి గుంజుకొస్తా — దయచేసి ఇకముందు ఎప్పుడయినా మాయన పిచ్చి వేషా లేస్తే నాకు చెప్పడం మరచిపోవద్దు. వుంటాను''— ఫోన్ పెట్టేసింది పర్వ తవర్ధని. నాగభూషణం నవ్వాపుకో లేకపోయాడు. సరిగ్గా పది నిమిషాల తరువాత రామయ్య చెప్పాడు.

''యమ్మెల్లే పోతురాజు వున్న పళంగా గెస్ట్ హవుస్ ఖాళీ చేసా డ్సార్''. నాగభూషణం మరోసారి నవ్వాడు తన ట్రిక్ పనిచేసినందుకు.

యమ్మెల్లే పోతురాజు ఆ తరువాత గెస్ట్ హవుస్ బుక్ చేసిన దాఖలాలేమీ లేవు.